క్లుప్తంగా

నేటి నుంచి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు

చాగల్లు: ఊనగట్లలో నూతనంగా నిర్మించిన పుంతలో మునలమ్మ అనే కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలు ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో గ్రామస్తులు, దాతలు సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణతో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ తెలిపింది. 31,1, 2వ తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు 3వ తేదీన ఉదయం 7.43 గంటలకు నూతనంగా నిర్మించిన ఆలయంలో పుంతలో మునలమ్మ అనే కనకమహాలక్ష్మి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

సోమాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

నల్లజర్ల: గ్రామదేవత సోమాలమ్మ తల్లి 31వవార్షికోత్సవ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సంబరాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. యలమాటి రాంబాబు దంపతులు భక్తులకు ప్రసాదవితరణ చేశారు. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఉత్సవ కమిటీ తెలిపింది.

చలివేంద్రం ప్రారంభం

గోపాలపురం: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని గోపాలపురం వర్తక సంఘం అధ్యక్షుడు, పంచాయతీ ఉపసర్పంచ్ వింత అమర్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం వర్తక సంఘం సభ్యులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వేసవి పూర్తయ్యే వరకూ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని అన్నారు. కార్యక్రమంలో వర్తక సంఘం కార్యదర్శి మద్దు జగన్‌మోహన్‌రావు, మద్దు నారాయణరావు, ఆమెన్ ప్రజామెడికల్స్ అధినేత శ్రీనివాస్, అనిల్, వెంకటేశు గోపాలపురం వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చాగల్లు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, పంచాయతీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉగాది ప్రసాదంతో పాటు మజ్జిగ వితరణతో ఈ చలివేంద్రాన్ని ప్రారంచారు. ప్రతి రోజు దాతల సహకారంతో మజ్జిగ వితరణ చేస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం మెరికమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కరుటూరి సతీష్, మానవత, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కవాతు

కొవ్వూరు: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా ఆదివారం పట్టణంలో పథ సంచలనం నిర్వహించారు. పూర్ణ గణవేష్ వేషధారణలో (యూనిఫాం) ధరించి భుజాన కర్ర వేసుకుని వీధుల్లో కవాతు నిర్వహించారు.అనంతరం సంస్కృత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ సమావేశంలో బలుసు జగదీష్, కల్లూరి సుబ్రహ్మణ్యం ప్రధాన వక్తలుగా ప్రసంగించారు. హిందువులంతా సంఘటితమైతే ప్రపంచమంతా సుఖ సంతోషాలతో ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులు, రైతులు, గిరిజనులు, విద్యార్థులు, ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి దేశ సేవ, సమాజ సేవే ప్రధాన లక్ష్యంగా సంఘం పని చేయాలని సూచించారు. గోవర్ధనం శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి, ఇసుక తరలింపు



పెరవలిలో బోల్తాపడిన మట్టి లోడు లారీ

పెరవలి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మట్టి, ఇసుక దోపిడీ రాత్రీ పగలు తేడా లేకుండా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి సమయాల్లో ఇసుక, మట్టి యథేచ్ఛగా తరలిస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడటం లేదని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇందుకు నిదర్శనంగా ఆదివారం తెల్లవారుజాము 3.30 గంటలకు పెరవలి సెంటర్‌లో మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీ బోల్తా పడింది. ఈ లారీలో ఎక్కడ నుంచి మట్టిని తరలిస్తున్నారు, ఎక్కడికి తీసుకెళుతున్నారో అధికారులకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఈ లారీలు రాత్రి సమయాల్లో చాలా వేగంగా వెళుతూ ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తాయి. మట్టిని తరలిస్తున్న లారీ 100 కిలోమీటర్ల వేగంతో వెళుతుండగా అదుపుతప్పి రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఢీకొట్టటంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే పెరవలి సెంటర్‌లో ఈ ప్రమాదం తెల్లవారుజామున జరగడంతో పెనుప్రమాదం తప్పింది. హైవే అధికారులు ప్రమాదం జరిగిన వెంటనే వచ్చి లారీని రోడ్డు మధ్య నుంచి తొలగించి మట్టిని పొక్లెయినర్‌తో తీసివేసారు. దీనిపై ఎటువంటి కేసు పోలీసులు నమోదు చేయలేదు.

శ్రీవారికి పూజలు

దేవరపల్లి: ఉగాది పర్వదినం సందర్భంగా దేవరపల్లిలోని భూ సమేత వేంకటేశ్వరస్వామిని ఆదివారం కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సునీల దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీస్సులు అందజేశారు.



దేవరపల్లి గ్రామ దేవత కడియాలమ్మ తల్లిని ఊరేగిస్తున్న గ్రామస్తులు



దేవరపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రాశి ఫలాలు వివరిస్తున్న వేద పండితులు రామకృష్ణ శర్మ



నిడదవోలులో శ్రీపూజ గణపతి కుమారస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చాగల్లులో ఉగాది వేడుకల్లో పంచాగ శ్రవణంలో పాల్గొన్న గ్రామస్తులు



పంచాంగాన్ని వివరిస్తున్న బ్రహ్మశ్రీ పొన్న కృష్ణబాబు

భక్తి శ్రద్ధలతో ఉగాది వేడుకలు

- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉత్సవాలు
- మాజీ హోంమంత్రి వనితతో పాటు నాయకులు హాజరు

నల్లజర్ల: విశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నల్లజర్ల శ్రీరామకృష్ణ మందిరంలో ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ హోం మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమెకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. లోక కల్యాణార్థం ఉదయం 6 గంటల నుంచే ఆలయంలో లక్ష్మీనారాయణ, శ్రీఆంజనేయ స్వామికి తమలపాకులతో పూజలు చేసారు. అనంతరం ఇక్కడ నిర్వహిస్తున్న సప్త, సప్తాహ హనుమాన్ చాలీసా పారాయణం 33వ రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు సామవేదం నరేష్, ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, వేద ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. కొయ్యల మూడి ధర్మయ్య దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించారు. వేద పండితులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా తానేటి వనిత మాట్లాడుతూ ఈ ఉగాది ప్రజలందరి జీవితాల్లో సరికొత్త ఉషస్సులు నింపాలని, వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరారు. మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రమణ్యం, నాయకులు బంక అప్పారావు, వామిశెట్టి పరమేశ్వరావు, తొమ్మండ్రు రమేష్, ముప్పిడి వెంకటరత్నం, వల్లూరి శేషగిరి, ఎంపీటీసీలు మేణ్ని వెంకటలక్ష్మి, వామిశెట్టి పావనీకుమారి, పాపా నాగేశ్వరావు, సయ్యద్



నల్లజర్లలో శ్రీరామకృష్ణ భక్తమందిరం వద్ద ఉగాది వేడుకల్లో పాల్గొన్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

మునాఫ్, వైఎస్ ఎంపీపీ అచ్యుతశివాజీ, కొనకళ్ల సీతామహాలక్ష్మి, ద్వారకాతిరుమల ఎంపీపీ బొండాడ మోహిని, వెంకన్నబాబు, దేవరపల్లి ఎంపీపీ కె.దుర్గారావు, గన్నమని జనార్ధనరావు, కుసులూరి సతీష్, నరహరిశెట్టి రాజేంద్రబాబు, సాలివేణు, గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఊరేగింపు

దేవరపల్లి: విశ్వావసునామ ఉగాది సందర్భంగా ఆదివారం గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి, నైవేద్యాలను సమర్పించారు. భక్తులతో గ్రామ దేవతల ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. దేవరపల్లిలోని గ్రామ దేవత కడియాలమ్మ ఆలయం వద్ద ఉగాది వేడుకలు నిర్వహించారు. అమ్మవారిని గ్రామంలో ఇంటింటా ఊరేగించారు. గ్రామస్తులు అమ్మవారికి చలివిడి పానకాలు, నూతన వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. దేవరపల్లి–గోపాలపురం రోడ్డులో స్వయంభుగా వెలసిన గంగాలమ్మ ఆలయం వద్ద ఉగాది వేడుకలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. యర్నగూడెం–పోతవరం రోడ్డులో కొలువైన గ్రామ దేవత బాట్ల గంగాలమ్మ తల్లి ఆలయం వద్ద ఉగాది వేడుకలు నిర్వహించి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. దేవరపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం, యర్నగూడెంలోని అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు వేపపువ్వు పచ్చడి, ప్రసాదాలను అందజేశారు. ఆలయాల వద్ద నూతన తెలుగు సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు.



వేడుకలలో పాల్గొన్న నాయకులు

ఆలయాల్లో పూజలు

చాగల్లు: ఉగాది సందర్భంగా మండలంలోని దేవాలయాలకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం బాలారామలింగేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు టి.భైరవమూర్తి పంచాగ పఠనం చేశారు. చాగల్లు రాజరాజేశ్వరీ స్వామి ఆలయంలో పంచాగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు లింగాల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. చాగల్లు కనకదుర్గమ్మ ఆలయంలో, పాటిమ్మపేటలోని పాటిమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం నాగారమ్మ ఆలయంలో, మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరంలో భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో పంచాంగ శ్రవణం

నిడదవోలు: ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో గణేష్‌చౌక్ సెంటర్‌లో శ్రీపూజ గణపతి కుమారస్వామి వార్ల ఆలయంలో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం బ్రహ్మశ్రీ పొన్న కృష్ణబాబు పంచాంగ పఠనం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సోమాల శివ, ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహాశాస్త్రి పాల్గొన్నారు.

హృదయాలయం నిర్వాహకులకు సత్కారం

రాజమహేంద్రవరం ఎస్వీ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా ఉత్తమ సేవలు అందిస్తున్న నిడదవోలు మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రం (హృదయాలయం) నిర్వాహకులు దండే గణేష్, బలగం విశాలాక్షికి ఎంపీ పురందేశ్వరి ఉగాది పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు.

ఘనంగా ఉగాది వేడుకలు

ఉండ్రాజవరం: ఉగాది వేడుకలను ఆదివారం మండలంలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తాడిపర్రు, ఉండ్రాజవరం, వెలగదుర్రు గ్రామాలతో పాటు పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు నిర్వహించి, ఉగాది పచ్చడి పంపిణీ చేసారు. ఉండ్రాజవరం గ్రామ దేవత ముత్యాలమ్మను బిల్వ పత్రములు (మారేడు దళములు)తో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఉండ్రాజవరం కొత్తపేటలో గండి పోచమ్మ అమ్మవారిని, సత్యవాడ శివారు మల్రిపాలెం వంతెన దగ్గర వేంచేసియున్న కొండాలమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలంగిలోని కనక దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో శక్తమ్మ తల్లి

కొవ్వూరు: శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది సందర్భంగా గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో కొవ్వూరమ్మ ఆలయంలో భక్తులు తెల్లవారు జాము నుంచే బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గరగ నృత్యాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మొయిన్‌రోడ్డులోని పుంత మునలమ్మ అమ్మవారు, ఏటిగట్టుపై కొవ్వూరమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫ్యాక్టరీ రోడ్డులో నూకాలమ్మవారి ఉగాది ఉత్సవాల్లో భాగంగా భారీ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు అమ్మ వారి ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటే శ్వరరావు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ సూరపనేని చిన్ని అమ్మవారి దర్శించుకున్నారు. వాడపల్లి, ఔరంగబాద్‌లోని వెదుళ్లమ్మ ఆలయాల్లో, వాడపల్లిలోని పుటాలమ్మ, మహా లక్ష్మమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల వ్యాప్తంగా పలు చోట్ల అమ్మవార్ల గ్రామోత్సవాలు నిర్వహించారు. కుమారదేవంలోని గండిపోశమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు వట్టికూటి వెంకటేశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



కొవ్వూరు మొయిన్‌రోడ్డులో ప్రత్యేక అలంకరణలో కొవ్వూరమ్మ

వైభవంగా గ్రామ దేవతల ఉత్సవాలు

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురంలోని పంట పొలాల్లో వెలసిన గ్రామ దేవత ధనమ్మతల్లి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. తాళ్లపూడిలోని మోదుగులమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సిరిబొమ్మను గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. శిరిబొమ్మ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో నామన పరమేశ్వరరావు, జడ్డు శ్రీను పాల్గొన్నారు. గజ్జరంలోని గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి ఉత్సవాలు నిర్వహించారు. తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనక దుర్గమ్మకు మహిళలు 108 బిందెలతో జలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.



అన్నవరప్పాడులో శక్తమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

శక్తమ్మ తల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెరవలి: అన్నవరప్పాడులో వేంచేసియున్న శక్తమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా ఆదివారం ప్రారంభమయ్యాయి. ఏటా ఉగాది రోజున ప్రారంభమయ్యే ఈ వేడుకలు వారం రోజుల పాటు కన్నుల పండువగా నిర్వహిస్తారు. భక్తుల పాలిట కొంగు బంగారంగా పిలవబడే అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తెల్లవారుజామున 4 గంటల నుంచి పోటెత్తారు. ఈ ఉత్సవాలను తిలకించడానికి ఖండవల్లి, ముక్కామల, నల్లాకులవారిపాలెం, పిట్టలవేమవరం, మల్లేశ్వరం, కడింపాడు, వడలి, పెనుగొండ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఖండవల్లి, అన్నవరప్పాడులో అమ్మవారి ఆలయాల వద్ద ఉదయం నుంచి భక్తులు మేకపోతులు, కోళ్లను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.



తాళ్లపూడిలో మోదుగులమ్మ తల్లి శిరిబొమ్మ ఉత్సవం

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



దూబచర్లలో ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల: మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలకు రూ.27 వేలు ఆర్థిక సాయం అందజేసినట్టు మానవత సంస్థ జిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ కండెపు వెంకటసూర్యనారాయణ ఆదివారం తెలిపారు. దూబచర్లలో అనారోగ్యంతో బాధపడుతున్న రాయలవరపు వీరాచార్యులుకు రూ.4 వేలు, వైఎస్సార్ కాలనీలో అగ్ని ప్రమాద బాధితుడు బైరవపాటి వెంకటేశ్వరరావుకు రూ.4 వేలు, ఉపాధ్యాయులు నందం రాజేంద్రప్రసాద్ మరో రూ.2 వేలు, కొత్తగూడెం గ్రామానికి చెందిన యండమూరి గణేష్‌కు రూ.4 వేలు అందజేశారు. సింగరాజుపాలేనికి చెందిన దూలం పోతురాజుకు రూ.5 వేలు, వరంగల్ జిల్లాలో వెటర్నరీ కోర్సు చదువుతున్న దూలం పోసికి ఫీజుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మండల చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, డైరెక్టర్ పాతూరి సత్యనారాయణ, మండలశాఖ అధ్యక్షులు ఝాన్సీరాణి, గుళ్లపూడి వెంకటరత్నం, దావులూరి చిరంజీవి, ఎస్.రాజేంద్రప్రసాద్, ఐడీవీ అప్పారావు పాల్గొన్నారు.

మానవత శాంతి రథం డ్రైవరు దుర్గారావు సేవలు గుర్తించి మానవత సంస్థ కార్యదర్శి పాతూరి రమేష్ రూ.5 వేలు బహుమతిగా అందజేశారు.

అన్నవరప్పాడు అర్చకుడికి ఉగాది పురస్కారం



కలెక్టర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకుంటున్న వాడపల్లి అనంత శ్రీనివాస్ ఆచార్యులు



ఎంపీ పురందేశ్వరి చేతుల మీదుగా ఉగాది పుస్కారం అందుకుంటున్న పరస రాధాకృష్ణ

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న వాడపల్లి అనంత శ్రీనివాస్ ఆచార్యులు కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ఆదివారం ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి వద్ద అర్చకత్వం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాని, తాను ఈ అవార్డుకి ఎంపికకావడం పూర్వ జన్మసుకృతమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు, జిల్లా సిబ్బంది ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ పాల్గొన్నారు.

పరస రాధాకృష్ణకు ఉగాది పురస్కారం

తాళ్లపూడి: ఆధ్యాత్మిక పురాణ ప్రవచకులు, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు, రచయిత, తాళ్లపూడికి చెందిన పరస రాధాకృష్ణ ఉగాది పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన ఉగాది ఉత్సవ పురస్కారాల్లో పరస రాధాకృష్ణకు ఎంపీ పురంధేశ్వరి చేతుల మీదుగా శాలువా కప్పి, మెమొంటోతో పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీతో పాటు మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు పాల్గొన్నారు.

నిర్దాక్షిణ్యంగా చెట్ల నరికివేత

- మిగిలిన మొదళ్లు
- గ్రామస్తుల ఆగ్రహం





కొవ్వూరుపాడులో నరికివేసిన భారీ వృక్షాలు

గోపాలపురం: కొత్త కరెంటు స్తంభాల నెపంతో మండలంలో సుమారు వందేళ్ల వయస్సున్న భారీ వృక్షాలను నరికేస్తున్నారు. చెట్ల తొలగింపుపై గ్రామస్తులు సర్పంచ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో.. చెట్ల నరికివేతను నిలిపివేశారు. గోపాలపురం నుంచి దొండపూడి వరకు సుమారు రెండు వేల చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల రోడ్డుకిరువైపులా ఎక్కడా చెట్లు లేకపోవడంతో, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కొవ్వూరుపాడులో సుమారు 40 టన్నుల వరకూ రోడ్డు పక్కన తొలగించిన చెట్ల కలపను పొగాకు బ్యారన్లకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై ఏపీఈపీడీసీఎల్ గోపాలపురం ఏఈ డి.సత్యనారాయణను వివరణ కోరగా, తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఏఈ కె.సత్యనారాయణ ఆయా ప్రాంతాలను పరిశీలించి, చెట్లు నరికిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ తతంగమంతా కొవ్వూరుపాడుకు చెందిన టీడీపీ, జనసేన నేతల కనుసన్నల్లో జరుగుతుందని, అందుకు స్థానిక ఎమ్మెల్యే మద్దతు ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో విరాళం అందజేస్తున్న కిరణ్‌కుమార్

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి దాతలు విరాళాలు ఇచ్చి సహకరిస్తున్నారు. విజయవాడకు చెందిన విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ దాసరి కిరణ్ కుమార్, శ్రీవిద్య దంపతులు దాసరి పాండురంగ, సాతులూరి వెంకట నరసయ్య జ్ఞాపకార్థం ఆదివారం నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. విరాళాన్ని పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎస్.జాన్‌పీటర్, అన్నదాన పథకం నిర్వాహకులు కళ్లే నాగేశ్వరరావుకు అందజేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

నిడదవోలు: ఇటీవల రాజమహేంద్రవరంలో అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని, ఆయన మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తూ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ నియోజవర్గంలోని క్రైస్తవ సంఘాల (జేఏసీ) ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని చర్చిపేటలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ స్థానిక గణపతి సెంటర్‌కు చేరుకుంది. అక్కడ మానవహారం నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తుల వెలిగించి పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి కలగాలని సంతాపం వ్యక్తం చేశారు. జేఏసీ కన్వీనర్ జువ్వల రాంబాబు, పాస్టర్లు బిషప్ నవీన్ కుమార్, సుధాకర్, ప్రకాష్, మణికుమార్, ప్రసన్నకుమార్, ఆశీర్వాదం, స్టాలిన్ పాల్గొన్నారు


పాస్టర్ ప్రవీణ్ మృతికి సంతాపం

నిడదవోలు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పట్టణంలో వివిధ చర్చిల్లో క్రైస్తవ సంఘాల పాస్టర్లు, క్రైస్తవులు ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. చర్చిపేటలో ఉన్న కృపాధార సెంటినరీ లూథరన్ చర్చిలో పశ్చిమగోదావరి జిల్లా సినడ్, బిషప్ పాస్టర్ బయ్యో ఆనందకుమార్ అధ్యక్షతన సంఘ విశ్వాసులు సంతాపం తెలుపుతూ ప్రార్థనలు చేశారు.

ధర్మవరంలో శాంతి ర్యాలీ

కొవ్వూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా ధర్మవరంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అన్ని సంఘాలకు చెందిన దైవజనులు, నేరుడుమిల్లి నాగు, వైఎస్సార్ సీపీ నాయకుడు జాలాది రవికుమార్, పాస్టర్స్ ప్రభాకర్ కొయ్య, జె.మోహన్, జేసుదాసు పాల్గొన్నారు.

గోపాలపురం: ప్రవీన్ పగడాల మృతికి సంతాపంగా ఆదివారం మండలంలోని పాస్టర్లు శాంతి ర్యాలీ నిర్వహించారు.



నిడదవోలు గణపతి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న క్రైస్తవులు